క్లుప్తంగా

శనీశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఉన్న శనీశ్వరస్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకం చేశారు. అనంతరం స్వామివారి విశే షాలంకరణ చేసి, పూజలు నిర్వహించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా విగ్రహప్రతిష్ట



హోమం చేస్తున్న అర్చకులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాటూరులో శనివారం చెంచులక్ష్మి సమేత నరసింహ స్వామి నూతన విగ్రహప్రతిష్ట ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు కలశాలు ఏర్పాటు చేసి, హోమాలు చేశారు. చెంచులక్ష్మి సమేత నరసింహస్వామి నూతన విగ్రహాలకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరై భక్తి శ్రద్ధలతో చెంచులక్ష్మి సమేత నరసింహస్వామి వారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలను పంపిణీ చేశారు.

స.హ. చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ఏఓ భారతి

బుచ్చినాయుడుకండ్రిగ: రైతులు సమాచార హక్కు చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఓ భారతి సూచించారు. మండలకేంద్రంలోని ఆర్బీకేలో శనివారం సమాచార హక్కు చట్టంపై రైతులకు అవగాహన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2005లో సమాచార హక్కు చట్టాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. ప్రభుత్వం రైతులకు అందించే విత్తనాలు, పనిముట్ల రాయితీ తదితర వివరాలను సమాచార హక్కు చట్టంలో పొందవచ్చని తెలిపారు. అలాగే పథకాల గురించిన వివరాలను తెలుసుకోవచ్చని చెప్పారు.

మరుగుదొడ్ల శుభ్రత సామగ్రి పంపిణీ

సత్యవేడు: మండలంలోని 64 ప్రభుత్వ పాఠశాలలకు మరుగుదొడ్లు శుభ్రపరిచేందుకు మూడు నెలలకు అవసరమైన రసాయనాలను పంపిణీ చేసినట్లు ఎంఈఓ కే.రవి తెలిపారు. శనివారం పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ఈ సామగ్రిని అందజేశారు. బాత్‌రూమ్‌ల శుభ్రతకు 364 లీటర్లు, మరుగుదొడ్లు కడగడానికి 543 లీటర్లు పంపిణీ చేసినట్లు ఎంఈఓ తెలిపారు. ఈకార్యక్రమంలో బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాసులు, ఎంఈఓ–2 ఉషా తదితరులు పాల్గొన్నారు.

రాస్ కార్యాలయంలో దసరా పూజలు



రాస్ కార్యాలయంలో పూజలు చేస్తున్న మహిళలు

శ్రీకాళహస్తి: రాస్ కార్యాలయంలో భక్తిశ్రద్ధలతో దసరా పూజలను పొదుపు సంఘాల లీడర్లు, సిబ్బంది నిర్వహించారు. ఈ సందర్భంగా రాస్ పొదుపు సంఘాల సంచాలకులు నాగరాజు మాట్లాడుతూ 44 ఏళ్లుగా రాస్ సంస్థ ఎన్నో ఉచిత సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందన్నారు. అలాగే పలు అవగాహన కార్యక్రమాలు కూడా నిర్వహిస్తున్నామన్నారు. మహిళలు వారి కుటుంబ సభ్యు లు సుఖసంతోషాలతో ఉండాలని ప్రార్థిస్తు న్నట్లు తెలిపారు. అనంతరం ప్రసాదాలు పంపిణీ చేశారు.

మండల పరిషత్ భవనం ప్రారంభం



నారాయణవనం: మండల పరిషత్ కార్యాలయ అదనపు భవనాన్ని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శనివారం ప్రారంభించారు. రూ.40 లక్షల అంచనా వ్యయంతో మండల పరిషత్, జిల్లా పరిషత్ నిధులతో మొదటి అంతస్తులో రెండు గదులతో పాటు సమావేశ మందిరం నిర్మించారు. ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ దివాకర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సుమన్‌కుమార్, అధికారులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లతో కలిసి శిలాఫలకాన్ని ఆదిమూలం ఆవిష్కరించారు. అనంతరం సమావేశ మందిరాన్ని ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు, గదులను ఎంపీటీసీ సభ్యులు రిబ్బన్ కత్తరించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ గుణశేఖర్, పీఆర్ డీఈలు గోపీ, మధుసూదన్‌రావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సారకాయలు తదితరులు పాల్గొన్నారు.

చక్రవ్యూహం

సత్యవేడు.. ఆంధ్రప్రదేశ్, తమినాడు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం. ఈ పట్టణంలో రాకపోకలు సాగించడమంటే వాహన చోదకుల సహనానికి పరీక్షే. ఇరుకైన రోడ్లు.. దారిపైనే వాహనాల పార్కింగ్.. భారీ లారీలు, టిప్పర్ల రాకపోకలు.. అడుగడుగునా ఆగిపోతున్న వాహనాలు వెరసి అమ్మో సత్యవేడు అనేలా చేస్తోంది. ట్రాఫిక్ రద్దీ కారణంగా గంటల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ప్రజలు రాకపోకలకు ఇక్కట్లు పడాల్సి వస్తోంది.

- సత్యవేడు మీదుగా అతి భారీ వాహనాల రాకపోకలు
- వాహన చోదకులకు తప్పని ఇక్కట్లు
- బైపాస్ రోడ్డుకు నోచుకోని సీఎం హామీ

సత్యవేడు మూడు రోడ్ల కూడలిలో స్తంభించిన ట్రాఫిక్



సత్యవేడు: నియోజక వర్గ కేంద్రంలో ట్రాఫిక్ సమస్య రోజు రోజుకూ జఠిలమవుతోంది. నిత్యం రద్దీగా ఉండే పట్టణ ప్రధాన రహదారి మీదుగా భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండడంతో ప్రజలు, వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సత్యవేడులో 20 వేలకు పైగా జనాభా ఉన్నట్లు అధికారుల అంచనా. దీనికితోడు పట్టణానికి సమీపంలోనే ప్రముఖ పారిశ్రామికవాడ శ్రీసిటీ ఉండడంతో పట్టణ జనాభా, వాహనాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. దీనికితోడు మండలంలోని 28 పంచాయతీల నుంచి రోజు విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు, డ్వాక్రామ మహిళలు బ్యాంకు పనులకు, వర్తకులు, రైతులు మార్కెట్, రెవెన్యూ, వ్యవసాయ కార్యాలయాలకు వచ్చిపోతుంటారు. ఈ నేపథ్యంలో నిత్యం గాంధీ రోడ్డు, నేతాజీ రోడ్డులు రద్దీగా ఉంటోంది.

శ్రీసిటీ ఏర్పాటుతో పెరిగిన వాహనాల రాకపోకలు

సత్యవేడు సమీపంలో శ్రీసిటీ ఏర్పాటు కావడంతో అక్కడ 250కు పైగా కంపెనీలు నెలకొల్పారు. ఈ నేపథ్యంలో నిత్యం కంపెనీలకు అవసరమైన ముడిసరుకులు, కంపెనీలు ఉత్పత్తి చేసిన ఉత్పత్తులు తరలించడానికి రోజూ భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీనికితోడు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు సరిహద్దులోని తడ సమీపంలో చెక్‌పోస్టులు ఉండడంతో పర్మిట్లు సక్రమంగా లేని అక్రమంగా సరుకు రవాణా చేసే వాహనాలు సత్యవేడు మీదుగా చెన్నై, బెంగళూరుకు వెళుతుంటాయి. దీంతో శబ్ద, వాయు కాలుష్యంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు. గాంధీ రోడ్డు , నేతాజీ రోడ్డు విస్తరణకు నోచుకోకపోవడం, ఇరువైపులా రోడ్డు మార్జిన్లు , మురుగు కాలువలు సైతం ఆక్రమణలకు గురి కావడం, రోడ్డుకిరువైపులా ద్విచక్రవాహనాలు రోడ్డు పైనే పార్కింగ్ చేస్తుండడం తదితర కారణాలతో నిత్యం ట్రాఫిక్ సమస్యతో పాదచారులు అవస్థలు పడాల్సి వస్తోంది. సిబ్బంది కొరతతో ట్రాఫిక్ నియంత్రణ పోలీసులకు కత్తిమీద సాములా మారింది.

క్వారీ లారీలతో ఇబ్బందులు

మండలంలోని పీవీ పురంలో ఉన్న క్వారీల నుంచి నిత్యం చెన్నై, ఇతర ప్రాంతాలకు సత్యవేడు మీదుగా కంకర, ముగ్గు పిండి తరలిస్తున్న టిప్పర్లు సత్యవేడు మీదుగా వెళుతున్నాయి. పట్టణంలో టిప్పర్లు అతి వేగంగా వెళుతుండడంతో టిప్పర్లుపై కంకర, మట్టి దుమ్ములేసి దుఖాణాల్లో నిండుతోంది. రోజు వచ్చిపోతున్న టిప్పర్లు కారణంగా వచ్చే దుమ్ము, దూళితో అనారోగ్యం పాలవుతున్నామని స్థానికులు వాపోతున్నారు.

సీఎం హామీ ఫలించేనా..

ఎన్నిక ప్రచారంలో సత్యవేడుకు వచ్చిన చంద్రబాబు కోమటిగుంట సమీపంలోని ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ నుంచి సత్యవేడు మూడు రోడ్ల కూడలిలోని గాంధీ విగ్రహం వద్దకు వచ్చేందుకు ట్రాఫిక్ సమస్య నెలకొంది. స్వయంగా ట్రాఫిక్ సమస్యను గుర్తించిన ఆయన సత్యవేడుకు బైపాస్‌రోడ్డు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని, బైపాస్ రోడ్డు ఏర్పాటు చేయిస్తామని హామీ ఇచ్చారు. టీడీపీ ప్రభుత్వం వచ్చి నాలుగు నెలలు పూరైంది. ఇప్పటికీ సత్యవేడు బైపాస్ రోడ్డు ఏర్పాటుకు చర్యలు తీసుకోలేదు.

బైపాస్‌తోనే ట్రాఫిక్ కష్టాలు దూరం



“ సత్యవేడు పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంది. రోడ్లు గుంతలమయంగా ఉండడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి సత్యవేడుకు బైపాస్ రోడ్డు నిర్మిస్తేనే కష్టాలు తప్పుతాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి బైపాస్ రోడ్డు నిర్మించేలా చర్యలు తీసుకోవాలి.

– బందారు మోహన్ బాబు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు, సత్యవేడు

తీవ్ర ఇబ్బందులు



వాహన చోదకులు పట్టణంలో ప్రయాణం అంటే భయపడుతున్నారు. పట్టణం మధ్య నుంచి భారీ వాహనాలు వెళుతుండడంతో విద్యార్థులు, ప్రజలు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్రవాహనాలు నిలిపే స్థలం ఏర్పాటు, ట్రాఫిక్ నియంత్రణ సిబ్బందిని పెంచాల్సిన అవసరం ఉంది. భారీ వాహనాలు పట్టణంలో మితిమీరిన వేగంతో వెళ్లకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలి.

– కే. ప్రసాద్, ఎన్ఆర్ అగ్రహారం

తల్లిదండ్రుల పాత్ర కీలకం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రతిమ

ఏర్పేడు: పిల్లల జీవన ప్రయాణంలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని కౌన్సిలర్ ప్రతిమ అన్నారు. శనివారం మండలంలోని నాగంపల్లి సమీపంలోని ఎస్ఓఎస్ బాలల గ్రామంలో మహిళల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల ఎదుగుదల కోసం సరైన సలహాలు, మార్గదర్శకాలను అందించడంతో వారి వ్యక్తిత్వం మెరుగుపడుతుందన్నారు. తల్లిదండ్రులు పిల్లలకు మార్గదర్శకులుగా నిలవాలని సూచించారు. ఏర్పేడు, శ్రీకాళహస్తి, వెంకటగిరి మండలాల నుంచి 149 మంది మహిళలు సమావేశానికి హాజరయ్యారు. కార్యక్రమంలో ఎస్ఓఎస్ కుటుంబ బలోపేత లొకేషన్ ఇన్‌చార్జి సత్యనారాయణ, మునిరత్నం, మహిళలు పాల్గొన్నారు.

శ్మశాన దారి అభివృద్ధికి సహకరించండి



ఎంపీ గురుమూర్తికి సమస్య వివరిస్తున్న ప్రజాప్రతినిధులు

ఎంపీ గురుమూర్తికి విన్నవించిన ప్రజాప్రతినిధులు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి శ్మశానానికి వెళ్లే దారిలో ఉన్న ఏటికాలువ వద్ద కలుజు నిర్మాణానికి సహకరించాలని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు ఎంపీ మద్దెల గురుమూర్తిని వేడుకున్నారు. శనివారం నాగలాపురం ఎంపీపీ భర్త శ్యామ్, వైస్ ఎంపీపీ దానివేలు, ఎంపీటీసీ సభ్యుడు దేశప్పన్, సర్పంచులు సుబ్రమణ్యం, మహేంద్రన్, ఏలుమలై తిరుపతిలోని ఎంపీ కార్యాలయంలో ఆయన్ని కలిశారు. సురుటుపల్లి శ్మశాన దారి ఆయనకు వివరించారు. ఏటికాలువ వద్ద ఎంపీ నిధుల ద్వారా కల్వర్టు నిర్మించి, మృతదేహాల అంతిమయాత్రకు ఎదురవుతున్న ఇబ్బందులను తొలగించాలని ఎంపీని వారు కోరా రు. స్పందించిన ఆయన నిధులు మంజూరుకు సహకరిస్తానని వారికి హామీ ఇచ్చారు.

రాష్ట్రస్థాయి పోటీలకు వరదయ్యపాళెం విద్యార్థులు



స్టీఫెన్



అభినాష్



పి. మౌని

వరదయ్యపాళెం: స్థానిక జెడ్పీహైస్కూలుకు చెందిన విద్యార్థులు పలు క్రీడా విభాగాల్లో రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల పీడీ బందిల కుమార్ తెలిపారు. పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న ఎం.స్టీఫెన్ అండర్–14 బాలుర విభాగంలో నెట్‌బాల్, అండర్–17 విభాగంలో పదో తరగతి చదువుతున్న ఓ.అభినాష్ బాల్ బ్యాడ్మింటన్‌కు, ఏడో తరగతి చదువుతున్న పి.మౌని అండర్–14 విభాగంలో కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

సచివాలయ సిబ్బంది విధులకు డుమ్మా



సచివాలయంలో ఖాళీగా దర్శనమిస్తున్న కుర్చీలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాటూరులోని సచివాలయంలో పనిచేస్తున్న సిబ్బంది శనివారం విధులకు హాజరుకాకపోవడంతో వారి కుర్చీలు ఖాళీగా దర్శమిచ్చారు. సచివాలయంలో ఏడుగురు పనిచేస్తుండగా డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, హెల్త్ అసిస్టెంట్ విధులకు హాజరయ్యారు. గ్రామకార్యదర్శి, మహిళా పోలీసు, సర్వేయర్, వీఆర్వో, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు విధులకు హాజరు కాలేదు. దీంతో వీరికోసం వచ్చిన గ్రామస్తులు ఎదురుచూచి వెనుదిగారు. అలాగే రైతు భరోసా కేంద్రంలో పనిచేసే సిబ్బంది విధులకు హాజరుకాకపోవడంతో మూత పడింది. రైతు భరోసా కేంద్రం మూత పడడంతో సిబ్బంది విధులకు హాజరుకాకపోవడంపై రైతులు ఆందోళన చేశారు. పంటలు వేస్తున్న తరుణంలో ఆర్బీకే సిబ్బంది విధులకు రాకపోవడం దారుణమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావును వివరణ కోరగా విధులకు సక్రమంగా హాజరుకాకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. సచివాలయాలు, రైతు భరోసాకేంద్రాల్లో పనిచేసే సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు కావాలన్నారు. తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని చెప్పారు. ఇకపై వారంలో రెండు రోజులు సచివాలయాలను పరిశీలించి, సిబ్బంది హాజరును తనిఖీ చేసి, తక్కువగా ఉంటే చర్యలు తీసుకుంటామన్నారు.

ముక్కంటి సేవలో నందమూరి రామకృష్ణ



నందీశ్వరుడికి నమస్కరిస్తున్న నందమూరి రామకృష్ణ

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని శనివారం నందమూరి రామకృష్ణ దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయాధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామి సన్నిధిలో వేదపండితులు ఆయన్ని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

పరశురామేశ్వర స్వామి ఆలయంలో..

ఏర్పేడు: మండలంలోని గుడిమల్లం పరశురామేశ్వర స్వామివారిని శనివారం నందమూరి రామకృష్ణ దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ బత్తల గిరినాయుడు, పూజారులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయంలో అర్చనలు, పూజలు చేవారు. ఆయనను పూలమాలలు, శాలువలతో సన్మానించి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

సబ్‌జైలు తనిఖీ



మాట్లాడుతున్న న్యాయమూర్తి బేబీ రాణి

శ్రీకాళహస్తి: స్థానిక సీనియర్ సివిల్ జడ్జి బేబీ రాణి పట్టణంలోని సబ్‌జైలును తనిఖీ చేశారు. స్టోర్‌రూమ్, వంటగదిని పరిశీలించారు. ఖైదీలకు పెడుతున్న భోజన నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ ప్రతి రిమాండ్ ఖైదీకి చట్టంపై అవగాహన ఉండాలన్నారు. అలాగే బెయిల్, ఉచితన్యాయం, చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, కోర్టు సిబ్బంది, సబ్‌జైలు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వం కట్టాలని దందా

శ్రీకాళహస్తి: పట్టణంలోని దేవునిబాట ప్రాంతంలో టీడీపీ కార్యకర్తనని చెప్పుకుని ఓ యువకుడు సభ్యత్వాల కోసం ప్రతి ఇంటికీ వెళ్లి రూ.వెయ్యి ఇవ్వాలని దందా చేస్తున్నారు. లేకపోతే ఇళ్లన్ని పడగొట్టిస్తామని ప్రతి ఒక్కరూ టీడీపీ సభ్యత్వం తీసుకోవాలని అందుకోసం రూ.వెయ్యి ఇవ్వాలని భయభ్రాంతులకు గురి చేశాడు. ఈ విషయమై సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. సభ్యత్వం కోసం దందా చేయడం ఏమని అక్కడిప్రజలు విస్తుపోతున్నారు. ఈ విషయంపై ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

పన్ను చెల్లించకుంటే వాహనాలు సీజ్ చేస్తాం



వాహన రికార్డులను తనిఖీ చేస్తున్న ఎంవీఐ

శ్రీకాళహస్తి: పన్నులు చెల్లించకుండా తిరుగుతున్న వాహనాలను సీజ్ చేస్తామని శ్రీకాళహస్తి మోటారు వాహనాల తనిఖీ అధికారి దామోదరనాయుడు అన్నారు. శనివారం ఆయన పలు వాహనాల రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి రవాణాశాఖ పరిధిలో చాలా వాహనాలు పన్నులు చెల్లించకుండా తిరుగుతున్నట్లు గుర్తించామన్నారు. ఇందులో ముఖ్యంగా వాణిజ్య అవసరాలకు వాడే ట్రాక్టర్ ట్రైలర్స్ సుమారు 600 వరకు పన్నులు చెల్లించకుండా తిరుగుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో తనిఖీలు ముమ్మరం చేసి, పట్టుపడిన వాహనాలను సీజ్ చేస్తామన్నారు. ఇక శ్రీకాళహస్తిలో చాలా మంది ట్రాక్టరు డ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్సు లేదని తెలిపారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ నేపథ్యంలో శనివారం రెండు వాహనాలను సీజ్ చేసి రూ.65 వేలు జరిమానా విధించారు. పన్నులు చెల్లించకుండా వాహనాలను తిప్పుతూ పట్టుపడితే 200 శాతం జరిమానా విధిస్తామన్నారు. సకాలంలో పన్నులు చెల్లించాలని సూచించారు.

ఇసుక, మట్టి మాఫియాకు అడ్డేలేదు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘాల నాయకులు

శ్రీకాళహస్తి: ప్రస్తుత ప్రభుత్వంలో ఇసుక, మట్టి మాఫియాకు అడ్డు లేదని కార్మిక సంఘాల నాయకులు ఆరోపించారు. వ్యాపారులందరూ సిండికేట్ కావడంతోనే ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా మూడు పువ్వులు, ఆరు కాయలుగా ఇసుక, మట్టి మాఫియా సామ్రాజ్యాన్ని విస్తరిస్తున్నారని చెప్పారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో జరుగుతున్న ఇసుక మాఫియాకు వ్యతిరేకంగా సీఐటీయూ కార్యాలయంలో కార్మిక సంఘాల నాయకులు శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, ఏఐటీయూసీ ఏరియా అధ్యక్షుడు వైఎస్ మణి మాట్లాడుతూ తొట్టంబేడు, మండలంలో ఇసుక, మట్టి మాఫియా పెట్రేగిపోతోందన్నారు. కొందరు నాయకులు పార్టీలతో సంబంధం లేకుండా సిండికేట్‌గా ఏర్పడి ఇసుకను దోచేస్తున్నారని మండిపడ్డారు. ఇసుక మాఫియా దాహానికి తొట్టంబేడు మండలంలోని ఇప్పటివరకు నలుగురు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే స్పందించి ఇసుక, మట్టి మాఫియాపై ఉక్కుపాదం మోపాలన్నారు. అనంతరం ఇసుక, మట్టి మాఫియాకు వ్యతిరేకంగా కరపత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అంగేరిపుల్లయ్య, గంధం మణి, కుమార్, వెంకటేష్, అన్వర్‌బాషా, వెంకటేశ్వర్లు, జనమాల గురవయ్య, జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో పల్లం విద్యార్థి ప్రతిభ



విద్యార్థి సతీష్‌తో హెచ్‌ఎం ఆనంద్, ఉపాధ్యాయులు

ఏర్పేడు: మండలంలోని పల్లం హైస్కూల్ విద్యార్థి సతీష్ రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆనంద్ శనివారం తెలిపారు. శుక్రవారం వడమాలపేట జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో వెయిట్ లిఫ్టింగ్ జిల్లాస్థాయి పోటీలు జరిగాయన్నారు. ఈ పోటీల్లో పల్లం హైస్కూలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి వై.సతీష్ ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. విద్యార్థి నవంబర్ 2 నుంచి 4వ తేదీ వరకు గుంటూరు జిల్లా, తెనాలిలో జరిగే రాష్ట్ర స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు హాజరుకానున్నట్లు చెప్పారు. విద్యార్థి ప్రతిభ చూపేందుకు దోహదపడిన వ్యాయామ ఉపాధ్యాయులు పుష్పవాణిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రెడ్డెప్ప, బాబు, వెంకటరమణయ్య పాల్గొన్నారు.

శిథిలావస్థలో అంగన్‌వాడీ భవనం



శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ భవనం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కారణి గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ భవనం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో పిల్లలు, బాలింతలు, గర్భిణులు, భయాందోళనకు గురవుతున్నారు. అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో గర్భిణులు 19 మంది, బాలింతలు ఆరుగురు, పిల్లలు 27 మంది ఉన్నారు. 30 ఏళ్ల కిందట నిర్మించిన ఈ భవనానికి మరమ్మతులు చేపట్టకపోవడంతో శ్లాబ్, గోడలు దెబ్బతిని కూలటానికి సిద్ధంగా ఉన్నాయి. శ్లాబ్ పెచ్చులూడి పడుతోంది. వర్షం పడితే ఉరుస్తుండడంతో బాలామృతం తదితర సరుకులు తడిచి ముద్ద అవుతున్నాయి. కార్యకర్త, సహాయకురాలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి అంగన్‌వాడీ భవనాన్ని మరమ్మతులు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నిబంధనలు పాటించాలి



బాణసంచా దుకాణదారులతో మాట్లాడుతున్న సీఐ

బుచ్చినాయుడుకండ్రిగ: బాణసంచా విక్రయంలో దుకాణదారులు నిబంధనలు పాటించాలని సీఐ తిమ్మయ్య తెలిపారు. శనివారం ఆయన ఎస్ఐ విశ్వనాథనాయుడుతో కలసి బుచ్చినాయుడుకండ్రిగలో బాణసంచా విక్రయదారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాణసంచా విక్రయదారులు నిబంధనలను విధిగా పాటించాలని, ప్రతి దుకాణం వద్ద రెండు అగ్నిమాపక సిలిండర్లు, రెండు బకెట్ల పొడి ఇసుక, నీటిని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఫైర్ అలారమ్ సిస్టమ్ ఏర్పాటుతో పాటు అత్యవసర పరిస్థితుల్లో అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. అధికారులు అనుమతించిన ప్రదేశాల్లోనే విక్రయ, నిల్వ కేంద్రాలను ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

రైతులను అడ్డుకున్న షికారీలు



షికారీలతో మాట్లాడుతున్న పోలీసులు

ఏర్పేడు: మండలంలోని చింతలపాళెం రెవెన్యూలో వివాదస్పద భూములను సాగు చేసేందుకు వచ్చిన రైతులను షికారీలు శనివారం అడ్డుకున్నారు. 20 ఏళ్లుగా రైతులు, షికారీల మధ్య భూ తగాదాలు జరుగుతున్నాయి. ఈ విషయంపై ఇరువర్గాల మధ్య కోర్టులో కేసు నడుస్తోంది. ఈ నేపథ్యంలో శనివారం భూములు తమవని రైతులు ట్రాక్టర్లతో చదును చేసేందుకు వెళ్లారు. సమాచారం అందుకున్న మరాఠీపురానికి చెందిన షికారీలు ఘటనా స్థలానికి చేరుకుని, భూములను చదును చేయకుండా ట్రాక్టర్లను అడ్డుకున్నారు. కేసు కోర్టులో నడుస్తుండగా భూముల్లోకి ఎలా ప్రవేశిస్తారని రైతులు, షికారీల నడుమ వాగ్వాదం జరిగింది. సమాచారాన్ని పోలీసులకు ఫోన్ ద్వారా అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రైతులు, షికారీలతో మాట్లాడారు. అనంతరం ఇరువర్గాలు పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపైనొకరు ఫిర్యాదు చేసుకున్నారు.

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు



గ్రామసభలో అర్జీలు స్వీకరిస్తున్న రెవెన్యూ అధికారులు

వరదయ్యపాళెం: దీర్ఘకాలిక భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు మండల డిప్యూటీ తహసీల్దార్ వెంకటసుబ్బయ్య తెలిపారు. శనివారం మండలంలో రీసర్వేకు ఎంపికైన కోవూరుపాడులో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికుల నుంచి అర్జీలు స్వీకరించి, సమస్యల పరిష్కారానికి వివరాలు తెలుసుకున్నారు. అనుభవంలో ఉండి రికార్డులు లేకుండా ఉన్న భూములకు, భాగపరిష్కార సమస్యలకు, రికార్డులు ఉండి ఆన్‌లైన్‌లో పొందుపరచని సమస్యలకు ఈ వేదిక పరిష్కారం చూపుతుందని వారు తెలిపారు. 25 మంది వరకు పలు సమస్యలపై అర్జీలు ఇచ్చారు. వచ్చిన ఫిర్యాదులను పూర్తిస్థాయిలో పరిశీలించి, అన్ని సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కోవూరుపాడు రెవెన్యూ గ్రామంలో పూర్తిస్థాయిలో రికార్డుల పరిశీలన పూర్తయిన తర్వాత భూములున్న ప్రతి రైతుకు నూతన పాసుపుస్తకాలు పంపిణీ చేస్తామన్నారు. సర్పంచ్ సామర్ల సుజాతమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు సామర్ల భువనేశ్వరి, మండల సర్వేయర్ రమణయ్య, వీఆర్వో చలపతి పాల్గొన్నారు.